

# భవానీద్వీపం

–వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 38 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పడమటి గదిలోనుండి పెద్దగా అరుపులు, మూలుగులు వినబడుతున్నాయి. ప్రసవ వేదన పడుతున్న పార్వతమ్మ కేకలు అవి. చూరుదించిన నడవాలో ఉద్విగ్నంగా పచార్లు చేస్తున్నాడు శంకరశాస్తుర్లు గారు. బింకంగా ఆయనకు ధైర్యం చెబుతూ తాము అధైర్యపడుతున్నారు గ్రామస్థులు కొందరు. లోపలనుండి అరుపు వినిపించినపుడల్లా ఉలికి పడుతున్నారు. పైపెచ్చు పైపై గాంభీర్యంతో 'పర్లేదు తేలిగ్గానే అయిపోతుంది, కంగారు పడకండి' అంటూ తాము కంగారు పడిపోతున్నారు. మధ్యమధ్య లోపలినుండి బయటకు తొంగిచూసి వెళుతున్నారు కొందరు మహిళలు. మంత్రసాని నాగవ్వ సముదాయింపులు, పార్వతమ్మ అరుపులు వినిపిస్తూనే వున్నాయి.

అంతకంతకు శాస్తుర్లు గారికి కంగారు ఎక్కువైపోతున్నది. ఉన్నట్టుండి పెద్దకేక, సంబరంగా నాగవ్వ కేక వినిపించాయి. కొంత విరామం తరువాత పురిటికందు ఏడుపు వినిపించింది. పురిటిగదిలో ఆడవాళ్ళ గొంతులు సంతోషంగా వినిపించాయి. లోపలినుండి పరుగున వస్తున్న కాలి అందెల సవ్వడి వినిపించింది. సింహద్వారం తెరుచుకుని ఒక తల బయటకు కనిపించింది. ' మగపిల్లాడు ' అన్నది చిరు సిగ్గు, చిరునవ్వు కలబోసి. తానేదో అడగడానికి శాస్తుర్లుగారు నోరు తెరిచారు. ఆయన అనుకున్నదేదో అడగకముందే లోపలినుండి మరొకసారి పార్వతమ్మ కేక వినిపించింది. వెనువెంటనే

ఆశ్చర్యంగా చిరు కేకతో నాగవ్వ గొంతు వినిపించింది. 'కవలలు..' మరుక్షణం భయంతో సంభ్రమంతో పెద్దగా అరిచిన అరుపు వినిపించింది. వెనువెంటనే లోపలున్న ఆడవాళ్లు అందరూ భయంతో అరిచిన కేకలు వినిపించాయి. ఒక్క గంతులో ద్వారం వద్దకు చేరుకున్నాడు శాస్త్రుర్లు గారు. కొందరు ఆయనను అనుసరించారు. తలుపులమీద చేతులు పడకముందే అవే విసురుగా తెరుచుకున్నాయి.

నిలువెల్లా వణికిపోతూ కనిపించింది అంతకుముందు శుభవార్తను అందించిన మహిళ. 'ఏమయ్యింది? ఎందుకలా అరుస్తున్నారు?పార్వతి స్పృహలో ఉన్నదా? కవలలు బాగున్నారా?' ఎడతెరపి లేకుండా ప్రశ్నల వర్షం కురిపించాడు శాస్త్రుర్లు గారు. ఆ స్త్రీ నుండి సమాధానం వచ్చేలోపే 'లోపలికి రావచ్చయ్యా! భయమేమీ లేదులెండి' అన్న నాగమ్మ గొంతు వినిపించింది. పరుగున లోపలికి  వెళ్ళాడు శాస్త్రుర్లుగారు. మగతగా కనులుమూసుకుని ఉన్నది పార్వతమ్మ. కొద్దిగా పక్కన మెత్తగా పరచిన గుడ్డల మధ్యన, ఉయ్యాలలో యిద్దరు మగశిశువులు అప్పుడే విచ్చుకున్న జంటకలువలలాగా వున్నారు. రెండు కలువలు, ఒకటి తెల్ల కలువ, మరొకటి నల్ల కలువ! ఆగీ ఆగీ సన్నగా లేత గొంతులతో ' ఉవ్వా ఉవ్వా ' అని రోదిస్తున్నారు. నాగవ్వ యింకా కంపిస్తూనే వున్నట్టు చాపి, శిశువులవైపు చూపిస్తున్న చేయి చెబుతున్నది.

ఒక్కగంతులో శిశువుల వద్దకు చేరుకున్నాడు శాస్త్రుర్లుగారు. యిద్దరు శిశువులను చూపులతో తడుముతున్నట్లు తేరిపారా చూడడంతోనే ఉలికిపడ్డట్లుగా వెనక్కు అడుగువేశాడు. అప్రయత్నంగా విస్మయము, భయము కలగలిసిన చిరు కేక వెలువడింది ఆయన గొంతునుండి. పసిడి మిసిమి కలిసిన తెలుపు ఛాయలో అప్పుడే విచ్చిన తెల్లకలువలా  మెరిసిపోతున్నాడు ఒక శిశువు. చూసేవాళ్లు శరీరాలు గగురుపొడిచేలా శిశువు ఛాతీనుండి పొత్తికడుపు దిగువ వరకూ పడగవిప్పిన త్రాచు పచ్చ పొడిచినట్లున్నది. చేయితిరిగిన చిత్రకారుడు అప్పుడే చిత్రించిన నల్లత్రాచు బొమ్మలా వున్నది. తెల్ల జామపండులాంటి శరీరం మీద కొట్టొచినట్లుగా కనిపిస్తున్న నల్లని త్రాచు బొమ్మ!

శిశువు బుల్లి పొట్టమీద బొడ్డుచుట్టూ రెండు చుట్టలు చుట్టి, బొడ్డుకిందకు తోకను వేళ్ళాడేసి ఉన్న నల్లత్రాచు చిత్రం! వాడి చిన్ని ఛాతీమధ్య విచ్చుకున్న పడగతో వున్న నల్లత్రాచు చిత్రం. వాడు ఊపిరి పీల్చుకుని వదులుతున్నప్పుడు లేత ఛాతీ కదులుతుంటే పడగవిప్పి వూగుతున్న నల్ల త్రాచులా భ్రాంతిని కలిగిస్తున్నది. తడబడుతూ ఆ శిశువును సమీపించింది నాగవ్వ. ఒడుపుగా వాడిని చేతులలోకి తీసుకుని వాడి వీపును చూపించింది శాస్త్రుర్లు గారికి. ఈసారి అందరికీ వినిపించేలా పెద్దగా శివ శివా అని కేకవేస్తూ తత్తరపాటుతో వెనుకకు అడుగు వేశాడు శాస్త్రుర్లు గారు. పొట్టమీద ముందువైపు వున్నట్లే, వెనుక, వీపుమీద కూడాశ్రద్ధగా వేసిన చిత్రంలా, తీర్చి దిద్దిన పచ్చలా ఉన్నది పడగవిప్పిన త్రాచు బొమ్మ!

శంకర శాస్త్రుర్లు గారు నిలువెల్లా వణుకుతున్న సంగతి తెలుస్తున్నది. మౌనంగా గది మూలలకు ఒదిగిపోయిన మహిళలు నివ్వెరపోయి చూస్తున్నారు, వారి వణుకు యింకా తగ్గలేదు. మధ్య మధ్య శిశువుల ఏడుపు ధ్వనులు విన్పించి ఆగిపోయినపుడు ఉఛ్వాస నిశ్వాసాల ధ్వని కూడా వినబడేంత నిశ్శబ్దం అలుముకుంటున్నది పురిటి గదిలో. కొద్దిగా మెసిలి కనులు తెరిచి చూసింది పార్వతమ్మ. భర్త కనిపించాడు. యిద్దరు శిశువులు కనిపించారు. అలసటగా చిరునవ్వుతో అరవిచ్చుకున్న పెదవులతో అంతలోనే మరలా మగతగా కనులు మూసుకుంది.

' ఎందుకు? ఎందుకిలా? నాగదోషమా? శాపమా?' తనలో తానే గొణుగుతున్నట్లుగా అంటూ దగ్గరికి వెళ్లి శిశువులను పరీక్షగా చూశాడు శాస్త్రుర్లు గారు. రెండవ శిశువు చామనఛాయలో వున్నాడు. వాడికి ఏ అసహజమైన లక్షణాలూ లేవు. తల్లీ కొడుకులను,ఒకమూలకు ఒదిగిపోయిన మహిళలను, నాగవ్వను కలలో వున్నవాడు చూస్తున్నట్లు కలయజూశాడు. పురిటిగది బయట వున్నవాళ్లకు సంగతి తెలిసిపోయినట్లుంది. గుసగుసగా మాట్లాడుకుంటున్నప్పటికీ విషయం తెలుస్తూనే వున్నది. శాస్త్రుర్లు గారికి వున్నట్లుండి నిన్న మధ్యాహ్నం పిలువకుండా వచ్చి, చెప్పకుండా మాయమైన నాగసాధువు గుర్తుకొచ్చాడు.

భార్యవున్న పురిటిమంచం వైపు నడిచి కొన్ని నిముషాలు చూపులతోనే సేద దీరుస్తున్నట్లు తేరిపారా చూశాడు. మరణయాతనకు తీసిపోని ప్రసవయాతనను అనుభవించి అలిసి మగతలో వున్నది ఆమె. పిల్లకు జన్మ తల్లులకు పునర్జన్మ! సాయంసంధ్యలో అప్పుడే ముడుచుకుంటున్న కమలంలా వున్నది ఆమె. జాలి, దయ, కృతజ్ఞత, ప్రేమ, మురిపెం అన్ని భావాలూ ముప్పిరిగొన్న చూపులతో భార్యను నిలువెల్లా తడిమాడు. అంతలోనే శిశువు ఒంటిమీది త్రాచు బొమ్మ గుర్తుకొచ్చింది. చటుక్కున తలతిప్పి అటువైపు చూశాడు పరిశీలనగా. పిడికిళ్లు బిగించి, చిన్ని నోరు తెరిచి తెరుచుకుని నిదురబోతున్నాడు, వాడికెంత అలసట అయ్యిందో! ఇప్పుడు ఏ విస్మయము, భయము అనిపించలేదు ఆయనకు. పెదవులపై చిరునవ్వు మెరిసింది, వింత

దృశ్యాన్ని చూస్తున్నట్లు. అప్రయత్నంగా 'నాగుమయ్య' అన్న పదం వెలువడింది నోటివెంట. దగ్గరకు వెళ్లి, మరొకసారి యిద్దరు శిశువులను ఆపాదమస్తకం పరిశీలనగా చూసి బయటకు నడిచాడు. ఒక్కసారి ఆ నాగసాధువు మరలా ప్రత్యక్షమై, దర్శనమిస్తే బాగుండు అనిపించింది మనసులో.

నడవాలో తమలో తాము గుసగుసలాడుతున్న వారు శాస్తుర్లు గారు బయటకు రావడంతో లేచి ఆయన యేమి చెబుతాడా అని కుతూహలంగా చూస్తున్నారు. యేవో ఆలోచనలలో మునిగిపోయినవాడిలా నెమ్మదిగా బయటకు నడిచాడు ఆయన. అరుగుమీద చేరగిలబడి నిన్న సాధువు కూర్చున్న స్థలాన్నే రెప్పకొట్టకుండా చూస్తూ కూర్చున్నాడు. ఆ విచిత్రమైన చూపులు, జడలు కట్టి పాదాలకు ఆనుతున్న ఆ జుట్టు, వదలకుండా పట్టుకున్న ఆ త్రిశూలం గుర్తుకొచ్చాయి. బొడ్డు క్రిందకు జారిన తెల్లని గడ్డం, చేతిలో పుఱ్ఱె గుర్తుకొచ్చాయి. క్షణాలలో యిద్దరు మనుషుల అన్నాన్ని, ఒక నిండు అరటి గెలను ఆబగా ఊడ్చిపారేసిన తిండి గుర్తుకొచ్చింది. భార్యకు ప్రసాదంగా ఎంగిలిచేత్తో యిచ్చిన అరటిపండు గుర్తుకొచ్చింది.

లౌకిక సమాజంతో సంబంధాలు తెంచుకున్నవాళ్ళు నాగసాధువులు. అణిమాది అష్టసిద్ధులను కైవసం చేసుకున్నవారు. తినేది మానవ కపాలాలలో తిండి, వుండేది శ్మశానాలలో, అది కూడా ఎవరికంటబడకుండా. ఖననం చేసిన పీనుగులను పీక్కు తినడం, శవ దహనం చేసిన బూడిదను పూసుకోడం, శవాలమీద కూర్చుని రోజులతరబడి హఠయోగ సాధన, నగ్నంగా శూలధారులై, మానవ కపాలధారులై తిరగడం వారి లక్షణం. నిరంతరం పరమశివుడి ధ్యానంలో వుంటారు. వెళ్ళాలి అనుకున్న దగ్గరకు అనాయాసంగా ఆకాశయానంలో వెళ్ళిపోతారుట! తన తాత వీరభద్ర శాస్త్రులవారు చిన్నపుడు తనను ఒళ్ళో కూర్చోబెట్టుకుని, గుహల్లా నోళ్లు తెరుచుకుని వింటున్న గ్రామస్థులతో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి ఆయనకు.

మహాకుంభమేళాకు ప్రయాగస్నానానికి వెళ్ళినపుడు నాగసాధువులను ప్రత్యక్షంగా చూశాట్ట తన తాత. ఎటునుంచి, ఎలా వచ్చారో తెలియకుండా వున్నట్టుండి వేలసంఖ్యలో నదీ తీరంలో ప్రత్యక్షమయ్యారుట. మహాకుంభమేళా చివరి రోజున నదిలో స్నానాలు చేసి, గట్టెక్కి, తర్వాత ఒక్కరు కూడా కనిపించకుండా మంత్రం వేసినట్టు మాయమై పోయారుట! వారి గురించి వినడమే తప్ప ఈ ప్రాంతాలలో వారిని ఎవరూ, ఎన్నడూ చూసిన జాడలు లేవు యిప్పటిదాకా. తన తాత వీరభద్రశాస్త్రి తండ్రి సదాశివశాస్త్రి. ఆయన తన కొడుకు ఏడేళ్లవయసువాడైన తర్వాత ఉపనయనం చేసి, మర్నాడు కనిపించకుండా పోయాట్ట. షుమారు పదిహేనేళ్ల తర్వాత శివారుగ్రామం అయ్యవారిగూడానికి చెందిన కాపులు ఒకాయన బదరీనాథం వెళ్ళినప్పుడు అక్కడ కనిపించాట్ట! గుర్తుపట్టి దగ్గరకు వెళ్లి పలకరించగానే తేరిపారా చూసి, పరుగున మాయమయ్యాడుట!

పెరిగి పెద్దవాడైనతర్వాత ప్రతి నదీ పుష్కరానికి తీర్థస్నానానికి వెళ్ళేవాడు వీరభద్రశాస్త్రి. ఏ తీర్థంలోనైనా తన తండ్రి కనిపిస్తాడేమోననే ఆశ ఒక కారణం! ముప్పై ఆరు సంవత్సరాలు దేశంలోని అన్ని నదులలో, అన్ని తీర్థాలలో స్నానం చేశాడట వీరభద్రశాస్త్రి. ఎక్కడా నాగసాధువులు కనిపించలేదు. మూడుసార్లు మూడు మహాకుంభమేళాలలో మాత్రమే కనిపించారుట. తాను తొంభైయేళ్ళ వయసులో చనిపోయేముందు కూడా తండ్రిని తలుచుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు వీరభద్రశాస్త్రి. నిన్న ఆ సాధువు కనిపించి వెళ్ళిపోయిన తరువాత శంకరశాస్తుర్లు చాలాసేపు ఆలోచించి దృఢపరుచుకున్నాడు, ఆ వచ్చింది నాగసాధువు కావచ్చు అని! నాగసాధువుతో మొదలై, దశాబ్దాల క్రితానికి, తన బాల్యానికి కొట్టుకుపోయాడు శంకరశాస్తుర్లు, అలలై ఎగిసిన ఆలోచనలలో.

అరుగుచుట్టూ చేతులు కట్టుకుని చూస్తున్నవారు ఆ మౌనాన్ని భరించలేకపోతున్నారు. ఇక వుండబట్టలేక ఒక వ్యక్తి నోరు తెరిచాడు. 'అయ్యా! ఎందుకు యిట్లా జరిగిందయ్యా? నరదృష్టా? నాగదోషమా? చేతబడా?' అంటూ యింకా ఏదో అడగబోయాడు, విరామం లేకుండా. మనకేం తెలుసు అన్నట్లు పెదవివిరిచి, చేతులు తిప్పాడు శాస్తుర్లుగారు. ఉన్నట్టుండి ఆయనకు నిన్న సాధువు యిచ్చిన రాయి గుర్తుకొచ్చింది. ' నాగమణి! నాగమణి! ' అన్న మాటలు గుర్తుకొచ్చాయి. ముదురు నీలిరంగులో నిమ్మకాయంత ఉన్నది అది. తళతళ మెరుపు కాకుండా, నిస్తేజంగా, సానపెట్టని మణిలా వున్నది. పూర్తిగా గుండ్రంగా లేదు, యించుమించు బాదంకాయ ఆకారంలో వున్నది. భార్యకు పురిటినొప్పులు మొదలవ్వడంతో త్వరపడుతూ పూజామందిరంలో చేతికి అందిన చిన్ని రాగి పళ్లెంలో పెట్టాడు దాన్ని. శివయ్య చల్లగా చూసి, భార్యకు సుఖప్రసవమై, పురిటిమైల తొలిగినతర్వాత యిల్లూ వాకిలీ శుద్ధి చేసుకుని, ఆవుపాలతో ఆ మణిని కూడా శుద్ధి చేసి, పూజామందిరంలో భద్రంగా వుంచాలి అనుకున్నాడు. యిప్పుడు ఆ మణి గుర్తుకొచ్చింది ఎందుకో.

ఒక్కసారి ఆ మణిని చూద్దామనిపించింది శంకరశాస్తుర్లవారికి. చివాలున లేచాడు. జారిపోతున్న ఉత్తరీయాన్ని సరిచేసుకుంటూ పరుగున లోపలకు నడిచాడు. చూస్తున్నవారు విస్మయంతో ఆయనను అనుసరించి గుమ్మంవద్దనే ఆగిపోయారు, లోపలికి చూస్తూ. పూజగది ముందుకు వెళ్లి, కొద్దిగా

సంశయించాడు శాస్త్రుల్లవారు. పురిటి మైలలో, పూజగదిని తెరవడం ఎందుకు అనుకున్నాడు, కానీ ఆగలేకపోయాడు. ఎందుకో ఒక్కసారి ఆ మణిని చూడాలి అనిపించింది బలంగా. ద్వారానికి కొద్దిగా దూరంగా జరిగి, ధోవతీ

కుచ్చిళ్ళను, ఉత్తరీయం కొసలను ఎగరకుండా ఒకచేత్తో పట్టుకుని, ఒకచేత్తో పూజగది గడియను మెల్లగా తొలిగించాడు. నెమ్మదిగా తలుపులను లోపలకు నెట్టి పూజామందిరంవైపు చూశాడు. అంతే! సగం తెరుచుకున్న తలుపుమధ్యనుండి కనిపించిన దృశ్యం ఆయనను నిలువెల్లా కుదిపేసింది. భయంతో, సంభ్రమంతో కెవ్వున కేకవేసి వెనక్కు దూకాడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS